## క్లుప్తంగా

### బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఆస్పరి సీడీపీఓ మద్దమ్మ

ఆస్పరి: గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని సీడీపీఓ మద్దమ్మ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 11 – 18 వయస్సు గల బాలికలను ఒక సంఘంగా ఏర్పరిచి వారికి ఆరోగ్యం, పోషణ, సంరక్షణ, సాధికారం, లింగవివక్షతపై అవగాహన కల్పించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఏఎన్ఎంలకు సూచించారు. ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ తిరుమలరావు, ఏపీఎం జనార్ధన, సూపర్‌వైజర్లు శివలింగమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

### ఆలయ పునర్నిర్మాణానికి రూ.31లక్షల విరాళం



విరాళం సొమ్ము అందిస్తున్న బొమ్మన దశరథ రామిరెడ్డి

వెల్దుర్తి: పట్టణంలోని 1వ వార్డులోనున్న పురాతన ఆంజనేయస్వామన్నాలయ పునర్నిర్మాణానికి మాజీ ఎంపీపీ బొమ్మన దశరథ రామిరెడ్డి రూ.31లక్షల విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఆయన గురువారం ఆలయంలోని స్వామి సన్నిధిలో కాంట్రాక్టరు ఎల్ నగరం మద్దిలేటికి రూ.5లక్షల నగదు అందించారు. గుడి పునర్నిర్మాణానికి రూ.60లక్షలతో ప్రతిపాదన చేయగా అందులో సగానికి పైగా గర్భగుడి, ఇతరత్రా పనులకు దశరథ రామిరెడ్డి అందజేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోదండ, రమేశ్, బాలాజీ, ఎల్లయ్య, మధు, రామకృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

### పక్కాగా భూసర్వే

మద్దికెర : రైతులు ఇబ్బందులు పడకుండా భూసర్వే పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ తెలిపారు. ఏపీ రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెరవలిలో అవగాహన ర్యాలీ చేసి రైతులతో గ్రామ సభ నిర్వహించి భూసర్వేపై అవగాహన కల్పించారు. రోజుకు కనీసం 20 ఎకరాలకు సర్వే చేస్తామన్నారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వో బాలవర్ధిరాజు, ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

### ఆరోగ్య పింఛన్ల తనిఖీ

వెల్దుర్తి: మండలంలోని పలు సచివాలయాల పరిధిలోనున్న ఆరోగ్య పింఛన్లను గురువారం అధికారుల బృందం తనిఖీ చేసింది. మొత్తంగా 17మంది వ్యాధిగ్రస్తులు పింఛన్ తీసుకుంటుండగా పరిశీలనకు వచ్చిన ప్రత్యేక వైద్యాధికారులు తాడిపత్రి ఏహెచ్‌కు చెందిన డాక్టర్ జీపీ హరికుమార్, అనంతపురం జీజీహెచ్‌కు చెందిన డాక్టర్ బి కళ్యాణ్ మొదటి రోజు మల్లెపల్లె, చెరుకులపాడు, వెల్దుర్తి-1, 2, 3 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ సుహాసిని, ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రఘు, వెల్దుర్తి ఈఓ లక్ష్మీనాథ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. తర్వాతి రోజుల్లో కలుగొట్ల సచివాలయ పరిధిలో పింఛన్ల తనిఖీ నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

### విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న మహేష్

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు రూ.50 వేల విలువజేసే ప్లేట్‌లు, గ్లాసులను మలేసియాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జి.మమేష్‌కుమార్ అందజేశారు. ఈ మేరకు గురువారం కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ వేణుగోపాలశర్మ సమక్షంలో అందించారు. అనంతరం మహేష్‌ను అధ్యాపక బృందం సన్మానించారు.

### రేపటి నుంచి వెల్దుర్తిలో క్రికెట్ టోర్నీ

వెల్దుర్తి: ఈనెల 11వ తేదీ స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో మండల స్థాయి సూపర్ 8 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ముత్యాల చిన్న తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుని, బొమ్మన శివశంకర రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే పోటీల్లో విజేతలకు రూ.10,016, రన్నర్స్‌కు రూ.5,016 నగదు బహుమతి అందిస్తామన్నారు. దాతల సహకారంతో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించాలని, వివరాలకు సెల్: 9391610171 నంబరులో సంప్రదించాలని కోరారు.

# ముస్తాబైన వైష్ణవ ఆలయాలు


- నేడు వైకుంఠ ఏకాదశి
- వైష్ణవాలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు
- రామళ్లకోటలో సత్యపీఠంపై వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుడి కల్యాణం
- హలిగేర గుహల్లో స్వయంభువు వెలసిన కూర్మ నారాయణ స్వామి
- శ్రీరంగాపురం కొండల్లో కొలువుదీరిన పాలుట్ల రంగస్వామికి పెళ్లి వేడుక



రామళ్లకోటలో శ్రీదేవి, భూదేవి సమేత వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి మూలమూర్తులు



పుష్పాలతో అలంకరించిన రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం



శ్రీరంగాపురం కొండల్లో పాలుట్ల రంగస్వామి ఆలయం

వెల్దుర్తి: ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవ ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం, స్వామి, అమ్మవార్ల కల్యాణాలు, ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక వేడుకలు జరగనున్నాయి. తరలిరానున్న భక్తులకు అనుగుణంగా ఆయా ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

**రామళ్లకోటలో సత్యపీఠంపై స్వామి కల్యాణం**

అలనాటి అపార వజ్ర నిక్షేపాల గని, ఖనిజ సంపద కలిగిన, శ్రీకృష్ణదేవరాయల విడిది కేంద్రం, బహమనీ సుల్తానులు, గోల్కొండ నవాబులు పాలించిన ప్రాంతం, బ్రిటీష్ కాలం నాటి తాలూకా కేంద్రమైన రామళ్లకోటలో ముక్కోటి ఏకాదశిన వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. రాయలకాలం నాటి ఆలయ ప్రాంగణంలో సత్యపీఠంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశుడి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. 10న తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, మహామంగళహారతి, తెల్లవారుజామున 4.30గంటకు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. మధ్యాహ్నం గం.11.15ని.లకు ల్యాణోత్సవం జరుపనున్నట్లు ఈఓ ఆంజనేయులు, ధర్మకర్త వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ తెలిపారు.

**శ్రీరంగాపురం కొండల్లో**

మండల కేంద్రానికి 30కి.మీల దూరంలో వెల్దుర్తి, బేతంచెర్ల మండలాల మధ్య శ్రీరంగాపురం సమీప ఏడు కొండలపై శేషశయనుడైన పాలుట్ల రంగస్వామి వారి కల్యాణం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శుక్రవారం మధ్యాహ్నం జరుగనున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి, అర్చకులు తెలిపారు. అలాగే స్థానిక రాయలకాలం నాటి రాముల వారి దేవాలయంలో సీతారామ, లక్ష్మణ, భరత, శత్రఘ్న, హనుమత్ సమేత స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు రాఘవ, కేశవ శర్మ సోదరులు తెలిపారు.

**కూర్మనారాయణ స్వామి ఆలయంలో..**

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో సహజ సిద్ధంగా ఉత్తర ముఖ ద్వారంలో వెలసిన స్వయంభూ కూర్మనారాయణ (నల్లగుట్టయ్య) స్వామి క్షేత్రంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించునున్నట్లు నిర్వాహకులు శివమోహన్‌రెడ్డి, సర్పంచ్ లింగమ్మ, నరేష్ గురువారం తెలిపారు. సహజ సిద్ధంగా ఏర్పడిన గుహలో స్వయంభువుగా కూర్మనారాయణ స్వామి వెలసిశాడు. ఆలయం పైభాగంలో గుట్ట కూర్మ (తాబేలు) ఆకారంలో కన్పిస్తుంది. 5వందల ఏళ్లకు పైగా ఉన్న రావి వృక్షం ఇక్కడి ప్రత్యేకత. కూర్మనారాయణ స్వామి వారికి వావిలాకులతో పూజలు చేయడం విశిష్టత.



కూర్మనారాయణ స్వామి



హనుమన్న స్వామి

**పత్తికొండలో..**

పత్తికొండ(తుగ్గలి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వస్వామి దేవాలయం ముస్తాబైంది. ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా నేడు స్వామి దర్శనానికి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. శుక్రవారం వేకువ జామున 5.30గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



విద్యుత్ దీపాలంకరణలో వేంకటేశ్వరస్వామి ఆలయం

**నేడు కల్యాణం..**



ప్రత్యేక అలంకరణలో తిరుమలరాయుడు స్వామి

కృష్ణగిరి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా విష్ణుమూర్తి గరుడ వాహనదారుడై ఉత్తర ద్వారాన దర్శనమిస్తాడని ప్రతీతి. ఆ దివ్యమూర్తిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతలంతా దివి నుంచి భువికి దిగివస్తారని అందుకే ఈ రోజును ముక్కోటి ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఈ రోజు స్వామి దర్శనంతో భక్తులకు ముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. మండలంలోని కర్లకుంట గ్రామంలో భూదేవి, శ్రీదేవి సమేత తిరుమలరాయుడి ఆలయం ఉత్తర ద్వారంతోనే నిర్మితమైంది. ఇక్కడ ఏటా ముక్కోటి ఏకాదశి మహోత్సవాలను గ్రామస్తులు వైభవంగా జరుపుకుంటారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవతో వైకుంఠ ఏకాదశి వేడుకలు ప్రారంభమవుతాయి. 5 గంటలకు తిరుమంజనసేవ, గోపూజ, 7గంటలకు ఉత్తర ద్వారా పూజ అనంతరం ప్రవేశం, భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. 9 గంటలకు సుదర్శన హోమం, 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు కళారత్న శతావధాని బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆర్‌టీఓ ఆర్గనైజర్ సూర్యచంద్రేశ్వర ఆధ్యాత్మిక ప్రవచనముంటుందని గ్రామస్తులు తెలిపారు. రాత్రి 9:30 గంటలకు మహానంది మండలం, గున్నంపాడు గ్రామం రాజేశ్వర ఆచారి వీరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర పూర్తి ఉచిత నాటకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### ముందస్తు సంక్రాంతి వేడుకలు



వెల్దుర్తిలో అలరించిన చిన్నారుల వేషధారణ



భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వెల్దుర్తి: మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శారద విద్యానికేతన్ పాఠశాలలో కరెస్పాండెంట్ కాత్యాయని, హెచ్ఎం కేజీ ప్రతాప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. సంక్రాంతి పండుగ ప్రతిబింబించేలా చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆస్పరి: మండల కేంద్రంలో నారాయణ ప్రైమ్ ప్రైవేట్ స్కూల్లో ముందస్తు సంకాంత్రి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో ముగ్గులు వేసి భోగి మంటలు వేశారు. ఈసందర్భంగా ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహించి సంక్రాంతి పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నరేష్ ఆచారి తెలిపారు.

ఆలూరు రూరల్: సంక్రాంతి పండగ పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో జెడ్పీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్, ఐటీఐ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు హెచ్ఎం బహుమతులు ప్రదానం చేశారు. మైనా, ఉమేష్, వాహిదా ఉన్నారు.



ఆలూరు జడ్పీ బాలికల పాఠశాల ఆవరణంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

### రమణీయం.. రథోత్సవం

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని హోసూరు సమీపంలోని తోటలో వెలసిన మహాత్మా యోగి నరసింహస్వామి రథోత్సవం అశేష భక్తజనుల మధ్య గురువారం రమణీయంగా నిర్వహించారు. రెండు రోజులుగా భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. తేరుపై భక్తాదులు అరటి పండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తినుబండారాలు, ఆట బొమ్మలు, గాజుల అంగళ్లు వెలిశాయి. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో తోట కిక్కిరిసిపోయింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సురేంద్రనాథరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.



హోసూరు సమీపంలోని తోటలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

### వలస కార్మికుడి మృతదేహం అప్పగింత

వెల్దుర్తి: రత్నపల్లె గ్రామ సమీప ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన వలస కార్మికుడు దుర్గన్ బెహరా ఈనెల 7న వంకలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తోటి కార్మికుడు ఘనశ్యాం బెహరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వచ్చేవరకు స్థానిక సీహెచ్‌సీ మార్చురీలో ఉంచారు. గురువారం మృతుడి భార్య భానుమతి బెహరా, కుమారుడు సగ్ర బెహరా రావడంతో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు. మృతుని అంత్యక్రియలు స్థానికంగా నిర్వహించారు. కుటుంబంతో దూరంగ ఉండడం, గత నాలుగు రోజులుగా పనిపట్ల సైతం పరధ్యానంలో ఉండేవాడని, ఆత్మహత్యకు కారణాలు తెలియడం లేదని తోటి కార్మికులు తెలిపారు.

**పరిహారం చెల్లించాలి**

వలస కార్మికుడు ఆత్మహత్యపై సంతాపం వ్యక్తం చేసిన సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి యాజమాన్యం రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. ఇటుకల బట్టీలలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు అరకొర సౌకర్యాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

### కిశోరి వికాసంపై శిక్షణ

దేవనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లుకు, ఏఎన్ఎంలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కౌమార వయస్సు పిల్లల పరిస్థితులు, వారి అభివృద్ధి మార్గాలు, పరిస్థితులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకునేలా శిక్షణ ఇచ్చారు.

హొళగుంద: కిశోర బాలికల పట్ల అన్ని విషయాల్లో జాగ్రత్తగ ఉండాలని ప్రతి అంశంపై అవగాహన కలిగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షీబారాణి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కిశోరి వికాశం కార్యక్రమంలో ఎంఈఓ-2 జగన్నాథం, ఈఓపీఆర్డీ చక్రవర్తి పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంఈఓ ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కిశోర బాలికల గురించి, చిన్నవయస్సులో పెళ్లిళ్ల గురించి, పోక్సో చట్టం గురించి, కిశోర బాలికలకు అధికారాలు అవగాహన కలిగించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు చంద్రావతి, చందన, ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసులు, ఏపీఎం శివయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ ఈరన్న

### భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కులో భాగంగా సమాధుల వద్ద నైవేద్యం, చాదర్ సమర్పించారు. పలువురు దర్గాలో, ఆవరణలో నిద్రించారు. అలాగే.. హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డి సాయిబాబా ఆలయాల్లో పూజలు చేశారు.

### సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

చిప్పగిరి: మండలంలోని దౌల్తాపురం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామంలో అవసరమున్న చోట ఈ సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ భారతి,నాయకులు రాజశేఖర్,హరికృష్ణ,విజయ్,మేకల రామాంజనేయులు తెలిపారు.

### జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో రూ.15 లక్షల జెడ్పీ నిధులతతో సీసీ రోడ్లు వేయనున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామంలో రోడ్లు వేసే ప్రాంతాలను పరిశీలించారు. రూ.10 లక్షలతో గాంధీ విగ్రహం వద్ద నుంచి ట్యాంకు వరకు, రూ.5 లక్షలతో పెద్దనగరి వీధిలో సీసీ రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే పనులు మొదలుపెట్టి సకాలంలో పూర్తి చేస్తామని చెప్పారు.

### పని భారం తగ్గించాలి

ఆస్పరి: అంగన్‌వాడీ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..అంగన్‌వాడీ కార్యకర్తలు చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం కొత్త కొత్త యాప్‌లు పెట్టి మానసికంగా వేధిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు శ్రీదేవి, ప్రమీల, విజయలక్ష్మి, జ్యోతి, రూతమ్మ, ఉమాదేవి, రాజమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

## హెచ్ఎంపీవీపై అలర్ట్

- ఆలూరు సీహెచ్‌సీలో 10 పడకల వార్డు ఏర్పాటు
- సిద్ధంగా ఆక్సిజన్ సిలిండర్లు



ఆలూరు సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన హెచ్ఎంపీవీ వార్డు

ఆలూరు రూరల్: హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు దేశంలో నమోదు కావడంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. వ్యాధి గ్రస్తులను చికిత్స అందించడం కోసం ముందస్తుగా ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో 10 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో సిద్ధం చేసిన ప్రత్యేక వార్డులో ఆక్సిజన్ సిలిండర్లను సైతం అందుబాటులో ఉంచారు. కోవిడ్ సమయంలో ఏర్పాటు చేసిన హైఫ్లోన్యాసల్ కాన్యులా (నిమిషంలో 30 లీటర్ల ఆక్సిజన్ అందించే) వాటిని సిద్ధం చేశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. వదంతులు నమ్మొద్దని, ఇది ప్రాణాంతకం కాదని, సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలే కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చేతులు శుభ్రంగా కడగాలి
- మాస్కు ధరించాలి
- బహిరంగ ప్రదేశాల్లో తుమ్మడం, దగ్గడం చేయకూడదు
- వైరస్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి

**ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం**



హెచ్ఎంపీవీ కామన్ కోల్డ్ లాంటిది. భయపడాల్సిన అవసరం లేదు. ముందు చర్యలో భాగంగా సీహెచ్‌సీలో 10 పడకల వార్డు ఏర్పాటు చేశాం. వృద్ధులు,చిన్న పిల్లలు అప్రత్తంగా ఉండాలి.

– వాహిద్,డాక్టర్,ఆలూరు సీహెచ్‌సీ

**లక్షణాలు..**

జ్వరం,గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటి వైరస్ లక్షణాలు. వైరస్ సోకిన వారికి అజిత్రోమైసిన్ లాంటి మందులతో చికిత్స అందిస్తారు. పిల్లలు,వృద్ధులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది. హెచ్ఐవీ, క్షయ, డయాలసిస్, సీఓపీడీ, అస్తమా రోగులు అధికంగా ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది.

**నేడు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా**

పత్తికొండ/తుగ్గలి : ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తుగ్గలి, పత్తికొండ సీపీఐ మండల కార్యదర్శులు సుల్తాన్, రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాల లేని వారు, అర్జీలు ఇచ్చిన వారు హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**రీ-సర్వేతో భూ సమస్యల పరిష్కారం**

పత్తికొండ/తుగ్గలి : రీ సర్వేతో ప్రతి రైతు భూమి ఎంత ఉందో సమగ్రంగా తెలుస్తుందని, భూ సమస్యలు పరిష్కారమవుతాయని తుగ్గలి, పత్తికొండ తహసీల్దార్‌లు రమాదేవి, రమేష్ అన్నారు. గురువారం తుగ్గలి మండలం పగిడిరాయి, పత్తికొండ మండలం జూటూరులో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా భూములను రీ సర్వే చేస్తామని తహసీల్దార్లు చెప్పారు. రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. సర్పంచ్ జయశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ, రీ సర్వే డీటీ బాలరాజునాయక్, తుగ్గలి డీటీ నాగరాజు, మండల సర్వేయర్లు గాదిలింగప్ప, సుధాకర్, వీఆర్వోలు వాసుదేవయ్య, నయోమి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

**ఆలూరు సీడీపీఓగా బాలమణి**

ఆలూరు రూరల్: ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణిగా బాలమణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓగా పనిచేస్తున్న బాలమణిని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆలూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్న పిల్లలకు పాలిచ్చే తల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందిస్తామన్నారు. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత లోపం రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నిత్రవట్టిలో వాహనంలో సామగ్రి వేస్తున్న కూలీలు



ప్రత్యేక వాహనంలో తెలంగాణకు తరలివెళ్తున్న కూలీలు

## పొట్టకూటికి సుగ్గిబాట

- నిత్రవట్టి, విరుపాపురం, ఐనకల్లు, తురువగల్లు నుంచి వలస వెళ్లిన కూలీలు
- గ్రామాల్లో ముగిసిన వ్యవసాయ పనులు
- ఉపాధి లేకపోవడంతోనే సుదూర ప్రాంతాలకు పయనం



ఐనకల్లు నుంచి గుంటూరుకు వెళ్తున్న కూలీలు

హాలహర్వి: మండలంలోని నిత్రవట్టి, విరుపాపురం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలు తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్లారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో నిత్రవట్టి గ్రామంలో 18 కుటుంబాలు, విరుపాపురం గ్రామంలో 10 కుటుంబాలు మూటా ముల్లె సర్దుకుని మినీ టిప్పర్‌లో పనుల కోసం వలస వెళ్లారు. వారు మాట్లాడుతూ తమకు స్థానికంగా చేసేందుకు ఉపాధి పనులు లేకపోవడంతో బతికేందుకు తెలంగాణ రాష్ట్రానికి వెళ్తున్నట్లు చెప్పారు. అధికారులు స్థానికంగా ఉపాధి పనులు కల్పించి ఉంటే తాము వలస వెళ్లేవాళ్లం కాదని పేర్కొన్నారు.

ఆస్పరి: మండలంలోని ఐనకల్లు, తురువగల్లు గ్రామాల నుంచి గురువారం గుంటూరుకు కూలీలు పిల్లా పాపలతో వలస వెళ్లారు. స్థానికంగా వ్యవసాయ పనులు పూర్తివడంతో పనులు లేక గుంటూరులో మిర్చి కోతలకు వెళ్తున్నట్లు చెప్పారు. రెండు గ్రామాల నుంచి 20 కుటుంబాలు బొలోరో వాహనంలో సరంజామాతో తరలివెళ్లారు. కాగా.. సంక్రాంతి పండుగ అయిన తరువాత వలసలు మరింత పెరిగే అవకాశం ఉంది. గుంటూరులో మిర్చి కోతలు రెండు నెలలు పాటు ఉంటాయని కూలీలు చెప్పారు.